ప్రజాశక్తి

గురువారం 6 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు






పల్నాడు జిల్లా నుండి ఢిల్లీ సభకు హాజరైన ప్రజాసంఘాల నాయకులు, సిపిఎం శ్రేణులు



గుంటూరు జిల్లా నుండి ఢిల్లీ సభకు హాజరైన ప్రజాసంఘాల నాయకులు, సిపిఎం శ్రేణులు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాకు చెందిన పలు రంగాల కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలనుండి సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఎన్.శివాజీ, బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, హుస్సేన్‌వలి, యం.భాగ్యరాజు, సుబ్బారావు, జె.బాలరాజు, ఈమని అప్పారావు,ఏపూరి గోపాలరావు, ఆంజనేయులు నాయక్, గుంటూరు మల్లేశ్వరి, తదితరులు ఢిల్లీలోని మర్కస్ నిజాముద్దీన్ నుండి ప్రదర్శనగా బయలుదేరి, ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగిన సభలో పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం): 6.25

సహరీ (శుక్రవారం ఉదయం): 4.47



గుంటూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

జిల్లాలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

వార్తలు లోపలి పేజీల్లో

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా

14 నుండి సిపిఎం ఆందోళనలు

8లో

పల్లెలకు చేరువగా వైద్య సేవలు

'ఫ్యామిలీ డాక్టర్' కు నేడు సిఎం శ్రీకారం

చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో అధికారుల ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు సిఎం జగన్ గురువారం చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో శ్రీకారం చుట్టనున్నారు. సిఎం జగన్ ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు లింగంగుంట్ల చేరుకుంటారు. అక్కడ డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌ని పరిశీలించిన అనంతరం సమీపంలోని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ స్టాళ్ళను పరిశీలించనున్నారు. ఆ తర్వాత కావూరు గ్రామంలో సభా ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం 12 గంటలకు చిలకలూరిపేట నుంచి బయలుదేరి తాడేపల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని పర్యవేక్షిస్తూ ఆరోగ్య సూత్రాలు పాటించేలా సలహాలు, సూచనలు ఇస్తూ వైద్యులు, సిబ్బంది ప్రతి 15 రోజులకు ఒక సారి గ్రామాలను సందర్శిస్తారు. ప్రభుత్వ వైద్యులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఒక కుటుంబానికి ఒక వైద్యుడ్ని కేటాయించడం ద్వారా వారి సమస్యలపై పూర్తి సమాచారంతో వైద్యులు చికిత్సలు చేసే అవకాశం ఉంది. గ్రామీణ స్థాయిలో ఆరోగ్య వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 104 వాహనంలో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి కుటుంబంలో అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి వారికి చికిత్సలు అందిస్తారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 14 నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే ఈ విధానం ద్వారా గ్రామాల్లో సర్వేలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. దీర్ఘకాలిక సమస్యలతో



పల్నాడు జిల్లా లింగంగుంట్లలో సిఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ పి రవిశంకరరెడ్డి తదితరులు

మంచంలో ఉన్న రోగులను ప్రత్యేకంగా గుర్తించారు. విలేజి హెల్త్ క్లినిక్‌ల్లో వీడియో కాలింగ్ సౌకర్యంతో టెలిమెడిసిన్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి క్లినిక్‌లోనూ నిత్యం 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు 250 మంది వైద్యులను ఎంపికచేశారు. నెలకు రెండు సార్లు వచ్చే ఈ వైద్య బృందం ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటారు. జనరల్ ఒపి, వైరల్ వ్యాధులు, గర్భిణులకు ప్రసవానికి ముందు సేవలు, బాలింతలకు ప్రసవానంతర సేవలు, శిశు సంరక్షణా, చిన్నారులకు వైద్య పరీక్షలు,

2లో

దళితులకిచ్చిన హామీలను నిలబెట్టుకోండి

సిఎంకి యడవల్లి, మురికిపూడి వాసుల గోడు



రైతు కష్టంపై అకాల వర్షం

కల్లాల్లో తడిసి ముద్దయిన మిరప

పూర్తిగా దెబ్బతిన్న మిరప చెట్లు

ఈదురు గాలులకు నేల పాలైన వాణిజ్య పంటలు

పరిహారం కోరుతున్న పల్నాడు రైతులు



వినుకొండ నియోజకవర్గంలో తడిచిన కల్లంలోని మిర్చి, నేలవాలిన బొప్పాయి పంట

4లో

సమిష్టిగా విధులు నిర్వహించండి

పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో గురువారం జరిగే పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం బందోబస్తు ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. బందోబస్తుకు ఇద్దరు అదనపు ఎస్పీలు,7 గురు డిఎస్పీలు,25 మంది సీఐలు,67 మంది ఎస్సైలు,211 మంది ఏఎస్సై ,హెడ్ కానిస్టేబుళ్లు 310 మంది కానిస్టేబుళ్ళు,260 మంది హెూంగార్డులతో కలిపి మొత్తం 917 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో పాటు 4 పార్టీల ప్రత్యేక బలగాల సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణము,రహదారి వెంబడి బందోబస్తు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పల్లెలకు చేరువగా వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

రక్తహీనత కేసులు, మంచాన పడిన వారి ఇళ్లకు వెళ్లి చికిత్సలు అందించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం. వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ, ప్రాథమిక చికిత్స, తరువాత మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రులు, జనరల్ ఆస్పత్రికి పంపడం పూర్తిగా చికిత్సలు అందేవరకు సంబంధిత వైద్యులు పరిశీలన, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా అందించాల్సిన శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఉపయోగపడుతుందని మంత్రి విడదల రజనీ తెలిపారు. వైద్య రంగంలో చేపట్టిన అనేక సంస్కరణలు ఇప్పటికే మంచి ఫలితాలు ఇస్తున్నాయని, ఈ విధానం తరువాత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



ఇదేం ఖర్మ రాష్ట్రానికి పోస్టర్లు చూపుతున్న టిడిపి నాయకులు

25వ వార్డులో ఇదేం కర్మ రాష్ట్రానికి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 25వ వార్డులో ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలపై వేసిన బారాలను వివరిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో పెరిగిన ధరలు, చార్జీలు, పెట్రోల్ ధరలు పెంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, ఓట్ల కనక మల్లికార్జునరావు, వాకా మంగారవు, షేక్ సుభాని, యు దుర్గా మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణం

ప్రజాశక్తి-మాచర్ల



స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి 9 గంటలకు జరుగుతున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఇఓ సాంబయ్యలు తెలిపారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకోని ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సత్యనారాయణ కల్యాణ మహోత్సవానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- బెల్లంకొండ

మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో నేడు జరగబోయే శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణ మహెూత్సవంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామంలో ఏ చిన్నపాటి కార్యక్రమానికైనా తన వంతు సహాయంతో పాటు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న కొమ్మలపాటి శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

దళితులకిచ్చిన హామీలను నిలబెట్టుకోండి

సిఎంకి యడవల్లి, మురికిపూడి వాసుల గోడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట మండలం యడవల్లి, మురికిపూడి గ్రామాల్లో దళిత భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని స్థానికులు సిఎం జగన్‌ను వేడుకుంటున్నారు. 2019 ఎన్నికల ముందు యడవల్లి భూములకు సంబంధించి ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయకపోగా ఈ భూముల నుంచి జరుగుతున్న మైనింగ్‌కు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నట్టు బాధితులు అరోపిస్తున్నారు. 2019 ఎన్నికల ప్రచార సభలో నే ను ఉన్నాను.. నేను విన్నాను..నేను అధికారంలోకి వచ్చిన వెంట నే యడవల్లి దళితుల భూములను తిరిగి వారికి ఇవ్వటమే కాకుండా ఆ భూములకు శాశ్వత హక్కు కల్పిస్తు పట్టాలిస్తానని, భూములకు సాగు నీ టిని అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కరెంటు సౌకర్యం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలు అమలు జరపకపోగా అధికారంలోకి వచ్చిన తరువాత 270 జి ఓ ఇచ్చి ఎకరానికి 8.33 లక్ష ల భూములను లాక్కోవటం చట్ట విరుద్ధమంటున్నారు. ఈ అంశంపై ఈరెండు గ్రామాల రైతులు పోరాడుతున్నా ప్రభ్వుతం లక్ష్యపెట్టలేదు. యడవల్లిలో జగన్న కాలనీలకు ఇళ్ళ స్థలాలకు ఎకరం రూ. 26 లక్షల ఇచ్చి కొనుగోలు చేసి దళితుల భూమి ఎకరం రూ.8.33 లక్షల ఇవ్వడం అంటే దళితుల భూమి కి ఒక రేటు వేరే వాళ్ళ భూములకు మరో రేటు ఇవ్వటం అంటే దళితుల ను మోసం చేయడం కాదా !. అసైన్డు భూములను కోనకూడదు అమ్మకూ డదు అని చట్టం చెబుతున్న అక్రమం గా దళితుల భూములను కొనుగోలు చేసిన వారీ దగర నుంచి మా భూము లు మాకు ఇప్పించండి వేడుకుంటు న్నారు మురికిపూడి గ్రామంలో భూముల చుట్టూ ఫెన్సింగ్ వేస్తే అధి కారులు చూస్తు ఉన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దళి తుల దగ్గర పట్టాలు,పాస్ పుస్తకాలు దళితుల చేతుల్లోనే ఉన్నాయి. మురి కిపూడి భూములవిషయంలో అత్యు న్త న్యాయ స్థానం స్థానిక మండల ప రిధిలోని మురికి పూడి గ్రామములో గ్రానైట్ పనులు ఆపమని సంబంధిత అధికారులకు,రక్షణ శాఖ,రెవిన్యూ శాఖ వారికి మంత్రికి కొద్ది రోజుల క్రి తమే స్టేటస్ కో నోటీ సులు స్టే జారీ చేసింది. కోర్టు వారి నోటీసులు అందు కున్న అధికారులు,నాయకులు వ్యా పారస్తులు కూడా కనీసం గౌరవ ప్ర దంగా ఒక్క అర్ధ గంట సేపు కూడా ఆపక పోవడం దలితులంతే ఎంతో తేలికో, కోర్టులంటె ఎంత గౌరవమో ఉందో అర్థం చేసు కోవచ్చు అన్నారు. దళితుల భూము లను తిరిగి వారికే ఇస్తామని నియోజ కవర్గంలో జరుగు తున్న అక్రమ మైనింగ్ పైవిచారణ జ రిపిస్తారని దళిత రైతులు,ప్రజలు కో రు కుంటున్నా రు.

12వ పిఆర్‌సిని ప్రకటించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉద్యోగ సంఘ నాయకులతో సంబంధం లేకుండా 12వ పిఆర్‌సిని ప్రభుత్వమే ప్రకటించాలని ఎపి ప్రభుత్వ సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు వినుకొండ రాజారావు కోరారు. గుంటూరులో బుధవారం అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పిఆర్‌సిలో నాయకుల తప్పిదాల వల్ల ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. నాయకులను నమ్మే స్థితిలో ఉద్యోగులు లేరని వారి స్వప్రయోజనాల కోసం ప్రభుత్వంతో ఒక మాట ఉద్యోగులతో మరో మాట మాట్లాడే వారు ఎక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం అనేక సమస్యలు పెరిగాయన్నారు. 12 వ వేతన సవరణ కమీషన్ లేకుండానే ఏపి క్యాడర్ ఉద్యోగులకు ఎంత రావాలో అంత ప్రభుత్వమే ప్రకటించాలని, 12వ వేతన సవరణ కమీషన్‌లో వచ్చే రాయితీలు నాయకుల ప్రమేయం లేకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సిద్ధం విజయ్ కుమార్, కోట నారాయణ మూర్తి,వలివేటి సురేంద్ర,సముద్రాల నందన వరప్రసాద్, నన్నపనేని భాస్కర్ రావు,కొయ్యలమూడి జయప్రకాష్, వేమవరపు శివకుమార్,ఆళ్ల ధన్ రెడ్డి, వంగా సాంబిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనవాసరెడ్డి

'మా నమ్మకం నువ్వే జగన్' గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-నరసరావుపేట

రాష్ట్ర ప్రజలు అంతా "మా భవిష్యత్ జగన్ అనే లక్ష్యంతో వున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం 'మా నమ్మకం నువ్వే జగన్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం చేసే సంక్షేమాన్ని తెలియజేస్తామని చెప్పారు. గహ సారథులు, సచివాలయం కన్వీనర్లు ఇంటి ఇంటికి వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి వివరించాలన్నారు. గత ప్రభుత్వ పని తీరు టిడిపి పనితీరు గురించి ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రొంపిచర్ల జడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి, కందుల ఎజ్రా, షేక్ ఖాదర్ బాషా, పాలపర్తి వెంకటేశ్వరరావు, సునీల్ పాల్గొన్నారు.

బిజెపికి మేలు చేస్తున్న ఎంఐఎం : కలీం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిజెపిని గెలిపించేందుకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పలు రాష్ట్రాల్లో అనైతిక పొత్తులను పెట్టుకుంటున్నారని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు మహమ్మద్ కలీం పేర్కొన్నారు. అందులో భాగంగానే కర్నాటకలో జెడిఎస్ పొత్తు పెట్టుకుంటున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. 2017 ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల నాటి నుండి 2022 వరకు వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎంఐఎం పోటీ వల్ల ముస్లిం ఓట్లు చీలటం తప్ప ముస్లిం సమాజానికి ఒరిగిన ప్రయోజనం ఏమిటో అసదుద్దీన్ ఓవైసి చెప్పాలన్నారు. ముస్లిం ఓట్లను చీల్చడం వల్ల బిజెపి లాభపడిందన్నారు. కర్ణాటకలో కూడ మజ్లిస్‌కి ఓటు వేస్తే ముస్లింల ఓటు చీలి ఇక్కడ కూడ బిజెపి లాభ పడవచ్చు అనే భావనతోనే ముస్లిం ప్రజలు ఉన్నారని తెలిపారు. ముస్లింలతో పాటు ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలను కూడ మజ్లిస్ పార్టీ ఆకర్షించాలన్నారు. కర్నాటకలో మొత్తం 224 స్థానాల్లో బిజెపి ఒక్క సీటు కూడా ముస్లింలకు ఇవ్వదన్నారు.జెడిఎస్, కాంగ్రెస్ ముస్లింలకు సీట్ ఇచ్చిన నియోజకవర్గాలులో ఎంఐఎం పోటీ పెట్టకుండ ముస్లింలు అత్యధిక శాతంలో ఉండి కూడ ఏ రాజకీయ పార్టీ ముస్లింలకు సీటు ఇవ్వని చోట మజ్లిస్‌ను పోటీలో పెట్టాలన్నారు.



బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ ఎనలేని కృషి

ప్రజాశక్తి-నరసరావుపేట

భారతదేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పల్నాడు పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి రవి శంకర్ రెడ్డి బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పులలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలు వారికి అభ్యున్నతికి, సమాజంలో సమానత్వాన్ని బాబు జగ్జీవన్ రామ్ కృషి చేశారన్నారు. బడుగు వర్గాల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ సంస్థను స్థాపించడంలో బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారన్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా నియమింపబడి ,ప్రత్యేక బంగ్లాదేశ్ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో అదనపు ఎస్పీ జి. బిందుమాధవ్, రామచంద్ర రాజు, డిఎస్పీలు, సీఐలు,ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలో జరిగే అన్ని అభివృద్ధి పనులను ప్రతిపక్ష నాయకులు జివి ఆంజనేయులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. బుధవారం బొల్లా కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సురేష్ మహల్ రోడ్డు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అభివృద్ధి పనులను ప్రతిపక్ష నాయకులు కోర్టులో కేసులు వేయిస్తూ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. టిడిపి హయాంలోనే ఎన్ఎస్పిలో అక్కడున్నవారికి ఇల్లు నిర్మాణం చేపట్టి ఇంటి తాళాలు వారికి అందజేస్తానని నాడు జివి ఆంజనేయులు చెప్పి నేడు ఆ నిందలు తమపై వేస్తున్నారని విమర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పలు గ్రామాల్లో రైతులు పంట నష్టపోయారని దీనిపై అంచనాలు తయారు చేస్తున్నారని పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయంలో కూడా జీవి ఆంజనేయులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 7వ తేదీన అన్ని సచివాలయాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



తిరగబడ్డ వాహనం, చెల్లాచెదురుగా పడిన క్యాబేజి బస్తాలు

వారధిపై తిరగబడ్డ వాహనం

రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-తాడేపల్లి

వారధిపై బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో బెంగుళూరు నుంచి క్యాలీఫ్లవర్, క్యాబేజీ లోడుతో వెళ్తున్న హైచర్ వాహనం తిరగబడింది. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు 4 కిలోమీటర్ల వరకు గుంటూరు వైపు కొలనుకొండ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయాన్నే 6.15 నిముషాలను హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై వెళ్లే శాతవాహన, రత్నాచల్, పినాకిని ఎక్స్‌ప్రెస్‌లకు వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. హైచర్ వాహనం తిరగబడటంతో క్యాబేజీ, క్యాలీఫ్లవర్ మొత్తం వారధిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండి సడన్ బ్రేక్ వేయడమే దీనికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.




కేక్ కట్ చేస్తున్న కాపు నాయకులు

హరిరామ జోగయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి -మంగళగిరి

కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరిరామజోగయ్య 86వ పుట్టినరోజు వేడుకలు బుధవారం మంగళగిరి నియోజకవర్గ కాపు సంక్షేమ సేన కార్యాలయంలో జరిగాయి. కార్యక్రమం ఃలో పాల్గొన కాపు సంక్షేమ సేన జిల్లా నాయకులు వై.నాగరాజు మాట్లాడుతూ కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కోరుకుంటూ ఈ సంస్థను ఏర్పాటు చేసిన హరిరామ జోగయ్య ధన్యవాదాలు తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో అధ్యక్షులు తిరుమలశెట్టి, కొండల రావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు నారాయణ స్వామి, డి.నాగేంద్రం, టి. రామకృష్ణ, కె.సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్ తదితరులు

ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-తాడికొండ

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఆసరా పథకం ఎంతో ఉపయోగపడుతుందని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా పథకం ద్వారా మహిళలను ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గుడిమెట్ల జ్యోతి, ఎంపిడిఓ మహేష్ బాబు, సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం

రూ. 4 లక్షలకు పైగా పంట నష్టం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో పది ఎకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి అయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పొలాలకు వెళ్ళిన రైతులు, కూలీలు ఆ పొలాల నుండి పెద్ద ఎత్తున మంటలు రావడం గమనించి రైతులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దగ్గరలో ఉన్న మేజర్ కాలువ నుండి నీళ్ళు తెచ్చి మంటలు ఆర్పేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అనంతరం నరసరావుపేట నుండి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ సంఘటనకు పాల్పడి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో పొలాల్లో కోసిన మొక్కజొన్న కండెలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన షేక్ ఖాశింకి చెందిన 2 ఎకరాలు,



పంటను ఆర్పే ప్రయత్నం చేస్తున్న రైతులు



దగ్ధమైన కండెలు

కంభంపల్లి కోటేశ్వరరావుకు చెందిన 5 ఎకరాలు, మరి కొంతమంది రైతుల పొలాల్లో వేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్దమైంది. సుమారు రూ.4లక్షలకు పైగా పంట నష్టం జరిగిందని వారు వాపోయారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట కొంత మేర దెబ్బ తినగా, అగ్నిప్రమాదం వలన పూర్తిగా దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణంతోనే మానవాళికి రక్షణ

ప్రజాశక్తి-వినుకొండ

మనం పర్యావరణాన్ని రక్షిస్తే, పర్యావరణం మనల్ని రక్షిస్తుందని కళాజాత బృందం పేర్కొంది. బుధవారం లోకల్ టూ గ్లోబల్ అనే అంతర్జాతీయ కార్యక్రమం ద్వారా టిడిహెచ్ అనే జర్మనీ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థతో మరియు ఆర్.ఎల్ హెచ్.పి.మైసూర్ వారి తోడ్పాటుతో ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ వారి సహకారంతో వినుకొండ బస్టాండ్ ప్రాంగణాల్లో కళాజాతర బృందం వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బృందం వారు వివిధ పర్యావరణ పరిరక్షణ కథలు, పాటలు, నాట్యరూపేణా ప్రజలకు అర్థమయ్యే సరళమైన భాషలో, ఆలోచనాత్మకముగా అవగాహన కల్పించారు. ఈ అవగాహనా కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన లభించింది.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

అనంతరం స్థానిక ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమములో వినుకొండ డిపో మేనేజర్ కోటేశ్వర నాయక్ ,టెర్రిడస్ హెూమ్స్ సంస్థ ప్రతినిధి గోడే ప్రసాద్ , హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ మరియు సంస్థ సిబ్బంది విద్యారావ్, రమేష్, షాహీధ,సంధ్య తదితరులు పాల్గొన్నారు



మీడియా ప్రతినిధుల బృందంతో రైతులు

ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్రతినిధుల బృందం బుధవారం తెనాలి మండలం అత్తోట గ్రామంలో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ రైతు ప్రాదికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ విదేశీయుల అధ్యయనానికి ప్రాతినిధ్యం వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని మనదేశంలో 12 రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించారని తెలిపారు. మధ్యప్రదేశ్‌తో ఒప్పందం జరిగి త్వరలోనే మన రాష్ట్ర ప్రకృతి రైతులు అక్కడకు వెళ్లి ఆ రైతులకు శిక్షణ ఇవ్వనున్నారని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన పంజా ప్రొడ్ అనే కమ్యూనికేషన్ గ్రూపు బుధవారం ప్రకృతి వ్యవసాయ సాగు అనే అంశాలపై వివరాలు సేకరించినట్లు తెలిపారు. పంటల వైవిధ్యానికి చిరునామా అయిన అత్తోటకి చెందిన నామాని రోశయ్య వ్యవసాయ క్షేత్రంలో విదేశీ బృందం పర్యటించడం ఆనందదాయకమన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మేఘాలయ రాజస్థాన్ రాష్ట్రాలతోనూ ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో జార్ఖండ్, ఛత్తీస్ ఘడ్, హర్యానాలతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశముందన్నారు. గతవారం ఇండోనేషియా నుంచి వచ్చిన బృందం వ్యవసాయ సాగుపై వివరాలు తెలుసుకున్నారని తెలిపారు. ఇతియోఫియా, రువాండా, దక్షిణ అమెరికాలోని ఆండ్రూస్, ఈక్వేడర్‌కు చెందిన సంస్థలతో మాట్లాడుతున్నామని, త్వరలోనే మన రైతులు ఆయా దేశాలకు వెళ్లి ప్రకృతి వ్యవసాయ విధానంపై అక్కడ రైతులకు శిక్షణ ఇస్తారని విజయకుమార్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారిణి రాజకుమారి, విదేశీ మీడియా ప్రతినిధులు మాథ్యూ లెక్యూట్, క్వెంటిన్ మేజరీ, బ్లాండిన్ జెఫ్రినో తదితరులు పాల్గున్నారు.

కెఎల్‌యు-లారస్ లేబొరేటరీల మధ్య ఎంఒయు



లారస్‌ల్యాబొరేటరిస్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న కెఎల్‌యు రిజిస్ట్రార్ కె. సుబ్బారావు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

హైదరాబాదుకు చెందిన లారస్ ల్యాబొరేటరితో వడ్డేశ్వరంలోని కెఎల్ విశ్వవిద్యాలయం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కెల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు బుదవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు బుదవారం కెఎల్ విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో లారస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఎఫ్ఒ వి.వి.రవికుమార్, కెఎల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు అవగాహనా ఒప్పంద పత్రాల పైన సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్.జి.పార్ధసారధి వర్మ , ప్రో.వైస్.చాన్సలర్ ఎన్.వెంకటరామ్ , రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు , ఎం.హెచ్.ఎస్. డీన్ ఆచార్య కిషోర్ బాబు, ఉద్యోగ కల్పన విబాగం డీన్ డాక్టర్ ఎన్.బి.వి.ప్రసాద్, రసాయనిక శాస్త్రం విబాగ అధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. చక్రవర్తి , లారస్ ల్యాబొరేటరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఎఫ్ఒ వి.వి.రవికుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు సిహెచ్.నరసింహారావు, మానవ వనరుల విబాగం డి.సునీతలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి-ఫిరంగిపురం



ఫిరంగిపురం గ్రామంలోని శాంతిపేటకు చెందిన నార్నిపాటి గౌతమి, శ్రీనుల కుమార్తె నార్నిపాటి హెప్సీబా,(12) అదృశ్యం సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం హెప్సీబాకు మతిస్థిమితం సరిగా ఉండదని 3వవ తేదీన ఉదయం 8.00 గంటల సమయంలో గౌతమి ,శ్రీనులు కూలి పనులకు వెళ్లగా వారి కుమార్తె హెప్సీబా ఇంటివద్దే ఉంది. ఆమె తల్లిదండ్రులు సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంటి వద్ద కనిపించడంలేదని, బంధువుల ఇళ్లల్లో చుట్టుపక్కల గ్రామాలలో వెతికిన ఆచూకీ తెలియలేదని తల్లిదండ్రులు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌కేసుగా నమోదు చేసినట్లు ఎస్.ఐ. శ్రీ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. తప్పిపోయిన హెప్సీబా సుమారు నాలుగు అడుగుల ఎత్తు, క్రాపు చేయించుకుని ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలపాలని ఎస్ ఐ లక్ష్మీనారాయనరెడ్డి తెలిపారు.

నవలూరులో వెలిగిన విద్యుత్ వీధి లైట్లు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్



మండలంలోని నవులూరు గోలివారి తోట మహాత్మా గాంధీ సెంటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ హై మాస్ట్ (విద్యుత్ లైట్లను)ను బుధవారం స్థానిక మహిళ చేత స్విచ్ ఆన్ చేసి ఎమ్మెల్యే ఆర్కే ప్రారంబించారు. నవులూరు గ్రామానికి ముఖద్వారంగా ఏర్పాటు చేస్తున్న ఆర్చ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. నవులూరు గోలి వారి తోట వద్ద అబివృద్ధి చేసిన సెంటర్ చాలా అద్భుతంగా ఉందని గ్రామానికి కొత్త రూపు వచ్చిందని స్థానికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూర్ బాషా సంఘం సన్మానం

ప్రజాశక్తి-వినుకొండ

ఇటీవల నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి, ట్రెజరర్ కాకాని నాగేశ్వరరావు, సెక్రెటరీ కొత్తకోట. హనుమంతరావులను బుధవారం సన్మానించారు. స్థానిక న్యాయవాది సంఘం అసోసియేషన్ ఆఫీస్‌లో వినుకొండ పట్టణ, నియోజకవర్గ నూర్ భాషా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి సన్మానం చేశారు. ఈ నూతన కార్యవర్గం మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సంఘ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూర్ భాషా సంఘం నాయకులు చాపల మడుగు చిన్న సైదా, 22 వ వార్డు కౌన్సి లర్ గాజులపాలెం. నాసరవలి ,దూదేకుల. హుస్సేన్, 19వ వార్డు ప్రధాన కార్యదర్శి దూదేకుల. సిద్ద య్య, దూదే కుల సైదావలి, సిహెచ్ నాగూర్ తదితరులు పాల్గొని సత్కరించారు.

పిడుగురాళ్ల పశువైద్యశాలకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పాటై ఏడాది అయిన సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అధికారులకు అందజేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని పశువైద్యశాలకు ఉత్తమ పత్రిభా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల వెటర్నరీ సహాయ సంచాలకులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకోవటం చాలా సంతోషంగా ఉందని, పల్నాడు జిల్లా ప్రథమ వార్షికోత్సవంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. పశువైద్యులు మన్నవ సాగర్, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

యడ్లపాడులో 'ఆశాల' సమావేశం

ప్రజాశక్తి-యడ్లపాడు



యడ్లపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశా డే మీటింగ్ బుధవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ గోపినాయక్, సిహెచ్‌ఒ పున్నారావు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎం, ఎమ్మెల్ హెచ్పిఎస్, ఆశాస్, మేల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ నెల థీమ్స్ గురించి డాక్టర్ గోపినాయక్, సిహె చ్‌ఒ పున్నారావు, సూపర్‌వైజర్లు వివరించారు. రికార్డ్సను పరిశీలించారు.



అమరావతిని సందర్శించిన కాకినాడ ఆర్‌జెడి

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిని కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీ) జి.నాగమణి బుధవారం సందర్శించారు. ధ్యాన బుద్ధ, పురావస్తు ప్రదర్శనశాలను సందర్శించారు. అక్కడున్న శిల్ప సంప దను చూసి వాటి ప్రాశస్త్యంను గురించి అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం అమరేశ్వర, సత్యసాయి ఆలయాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం. శ్రీనివాసరావు, ఎమ్మార్సీ సిబ్బంది, పి. మారుతి రవిశంకర్, బి.సత్యనారాయణ,మ్యూజియం గైడ్ చిన్న బాబు పాల్గొన్నారు.

రైతు కష్టంపై అకాల వర్షం

- నాలుగు రోజులుగా ఈదురు గాలులు, వడగళ్ల వాన
- కల్లాల్లో తడిసి ముద్దయిన మిరప
- పూర్తిగా దెబ్బతిన్న మిరప చెట్లు
- ఈదురు గాలులకు నేల పాలైన మామిడి, అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర పంటలు
- పరిహారం కోరుతున్న పల్నాడు రైతులు



వెల్లటూరులో..

ప్రజాశక్తి - వినుకొండ

ఈదురు గాలులు, వడగళ్ల వర్షం బీభత్సానికి పల్నాడు జిల్లా అన్నదాత తీవ్రంగా నష్టపోయారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని అనేక మండలాల్లో పంటలు, ఉద్యాన పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. చేతికి అందివచ్చిన మిరప పంటను కోత కోసి కల్లాల్లో ఆరపెట్టుకుంటే అకాల వర్షం మిరప రైతుకు కన్నీళ్లే మిగిల్చింది. గత ఏడాది నల్ల తామర పురుగు ఆశించడంతో మిరప రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఈ ఏడాది కొంత మేరకు తట్టుకొని చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తే, గత ఏడాదిలో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవచ్చునే ఆశించిన రైతుకు



నరగాయపాలెంలో కల్లాల్లో దెబ్బతిన్న మిరపకాయలు

ఈసారి కూడా నష్టం తప్పలేదు. పల్నాడు జిల్లాలో 1,45,00 ఎకరాలు రైతులు మిరప సాగు చేస్తున్నారు. మొదటి కాపునకు తాలుకాయ రావడంతో రైతులందరూ రెండవ కాపు దిగుబడిపై ఆధారపడ్డారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినప్పటికీ, కోత కోసి కళ్ళల్లో ఆరపెట్టుకుంటే అకాల వర్షంతో తడిసిపోయింది. దీంతో తాలు పెరిగి ధర పడిపోయి తీవ్రంగా నష్టపోయే పరిస్థితిలో ఉన్నారు. జిల్లాలో అధిక శాతం పంట సాగు చేస్తోంది కౌలు రైతులు. ఎకరానికి రూ.30 వేల వరకు కౌలు చెల్లిస్తూ, ఎకరానికి లక్షకు పైగా పెట్టు బడులు పెట్టి సాగు చేస్తున్న వారే అధికం. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు లేక ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు అప్పులు తెచ్చి పంట పెట్టుబడి పెట్టారు. అకాల వర్షంతో, వడగళ్లు ఈదురుగాలుల బీభత్సంతో నష్టపోయిన మిరప,కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలో అధికశాతం రైతులు మిరప సాగుపై ఆధారపడి జీవి సున్నారు. గత రెండేళ్లుగా నష్టాన్ని తెచ్చిన మిరప పంట, ఈ ఏడాది మంచి ధర వచ్చి అప్పులు తీరతాయనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. వెల్లటూరు, నాయుడు పాలెం, సంఘీయుడుపాలెం కనుమలచెరువు, బొల్లాపల్లి సరికొండపాలెం తదితర గ్రామాలతో పాటు గిరిజన తండాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వినుకొండ, నూజెండ్ల మండలాల్లోని పలు గ్రామాల్లోని మిరప రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, నకరికల్లు, పిడుగురాళ్ల, బెల్లంకొండ, మాచర్ల, దుర్గి, కారంపూడి తదితర ప్రాంతాల్లో మిరప పంటతోపాటు అరటి, మామిడి, బొప్పాయి, వివిధ రకాల కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఉద్యానవన శాఖ అధి కారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగింది. ఆయా ప్రాంతాల్లో కురిసిన వడగళ్ల వర్షానికి మిరప చెట్లు కొమ్మలతో సహా విరిగి పోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి పంట 33 శాతానికి పైగా దెబ్బతింటేనే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. ప్రతి పంట 60 శాతానికి మించి దెబ్బ తిని వేర్లతో సహా ఊడి, పూర్తిగా రాలి నేల



రాజుపాలెం మండలంలోని అంచువారిపాలెం వేళ్లతో సహా విరిగిపడ్డ మామిడిచెట్టు

మట్టమైన పంటలను మాత్రమే అధికారులు అంచనాలు వేసి ప్రభు త్వానికి నివేదిస్తున్నారు తప్ప, దెబ్బతిని నష్టపోయిన పంటల వివరాలను సమగ్రంగా నివేదించడం లేదని విమ ర్శలు రైతుల నుండి వినిపిస్తున్నాయి.

రాజుపాలెం మండలం అంచులవారిపాలెంలో మామిడి పంట ఈదురు గాలుల బీభత్సానికి పూర్తిగా దెబ్బతింది. చెట్టు వేళ్లతో సహా వాలి పోయాయి. జిల్లాలోని అనేక మండలాల్లో అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, వివిధ రకాల పండ్ల తోటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. కానీ ఉద్యానవన శాఖ అధికారుల నివేదిక మాత్రం కేవలం 133 హెక్టార్ల (332.5 ఎకరాలు)లో మాత్రమే పంట పూర్తిగా నష్టపోయిందని ప్రభుత్వానికి నివేదించారు. వాటిలో 90 హెక్టార్ల (225 ఎకరాలకు పైగా)కు పైగా మిరప పంట దెబ్బతిన్నట్లు నివేదించారు. కానీ, జిల్లాలో కొన్ని వేల పట్టాలలో మిరప పంట దెబ్బతినడం, కల్లాల్లో ఆరవేసిన పంట తడిసి రైతులు పూర్తిగా నష్టపోయారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవడం లేదని ఉద్యాన పంటలు సాగు



బెల్లంకొండ మండలంలో దెబ్బతిన్న టమోట

చేస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప పంట నష్టపోవడానికి కారణం ప్రభుత్వమే నని చెప్పాలి. ఎందుకంటే, ప్రతి ఏటా రైతు పండించిన పం టను ఆరపెట్టుకునేందుకు, అకాల వర్షాలు వచ్చినప్పుడు పంటను కాపాడుకునేందుకు ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేస్తుంది. గత మూడేళ్లుగా వైసిపి ప్రభుత్వం వాటిని పట్టణ రైతులకు ఇవ్వలేదు. పంట తమ కళ్ళ ముందే తడిసిపోయి ముద్దవుతుంటే రైతు కాపాడుకునే పరిస్థితి లేకుండాపోయింది. కొన్నిచోట్ల మాత్రం పంటను కాపాడుకునేందుకు షామియానా పట్టాలను కప్పారు. అకాల వర్షంతో వేల ఎకరాల్లో నష్టపోయిన మిరప రైతు, కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి పంట నష్టపరిహారాన్ని అందించాలని రైతు సంఘాల నాయకులు రైతులు కోరుతున్నారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలను గుర్తించి అంచనాలతో నివేదించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



నకరికల్లు మండలం చల్లగుండ్లలో గాలులకు విరిగిపోయిన అరటి పంట



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

ప్రజలకు ఏం నాయ్యం చేశారు?

ముఖ్యమంత్రికి ప్రత్తిపాటి బహిరంగ లేఖ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ప్రారంభించేందుకు చిలకలూరి పేట నియోజకవర్గానికి విచ్చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగ న్మోహన్‌రెడ్డికి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం బహిరంగలేఖ రాశారు. ఈ సందర్భంగా స్థానిక పండరీపురంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ లేఖ ద్వారా పలుఅంశాల గురించి ముఖ్యమంత్రిని ప్రశ్నించినట్లు చెప్పారు. మాట తప్పుడు మడమ తిప్పుడు ధోరణిలో ఈ నాలుగేళ్ల పాలన సాగిందని విమర్శించారు. ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ను అనారోగ్య ఆంధ్ర ప్రదేశ్ గా, అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని, ప్రజల పక్షాన ఈ లేఖ ద్వారా తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కోరారు.నాడు ఎన్నికల హామీలలో భాగంగా చిలకలూరి పేటలో ఆటో నగర్ ఏర్పాటు, యడవల్లి దళితులకు పట్టాలు, ఇళ్లు ఉచితంగా ఇస్తా నన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్థానిక మంత్రిపై ఆయన ఆరోపణలు, విమర్శలు గుప్పించారు. ఈ నియోజకవర్గానికి స్థానిక మంత్రి ఏం సాధించారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులకు అందించిన నష్టపరిహారం గురించి ప్రజలకు వివ రించాలని, నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలను రైతులకు ఎందుకు అందుబాటులోకి తేలేదని ఆ లేఖలో ప్రశ్నించారు.



రైతు బజార్లో పెరిగిన షాపుల అద్దెలు

- కూరగాయల ధరలూ మండుతున్నాయంటున్న వినియోగదారులు
- రాజధానికి భూములివ్వడంతో తగ్గిన ఉద్యాన సాగు
- ఇతర మార్కెట్ల నుండి రైతు బజార్‌కు దిగుమతి

ప్రజాశక్తి - మంగళగిరి

కూరగాయలు పండించే రైతులు నేరుగా విక్రయించుకోవడానికి రైతు బజార్లు ఏర్పాటు చేశారు. రైతులకు కేటాయించిన షాపులు కాకుండా మిగిలిన షాపులను కొన్ని డ్వాక్రా గ్రూపులకు, మరికొన్ని వాణిజ్య షాపులకు అద్దెలకు ఇచ్చారు. అయితే గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు ఇప్పటి వైసిపి ప్రభుత్వం అద్దెలు భారీగా పెంచిందంటూ అద్దెదారులు వాపోతున్నారు. మరో పక్క రాజధాని భూముల్లో పంట లేకపోవడంతో ఇతర మార్కెట్ల నుండి దిగుమతి చేసుకున్న కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వినియోగదారులు విలవిల్లాడుతున్నారు.

మంగళగిరిలో 1999లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో గాలిగోపురం సెంటర్లో దేవస్థానం స్థలములో రైతు బజార్ ఏర్పాటు చేశారు. తదనంతరం రైతుబజార్‌ను మంగళగిరి వ్యవసాయం మార్కెట్ ఆవరణలో 2011లో 32 షాపులతో ఏర్పాటు చేశారు. వాటిల్లో 29 షాపులు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయి. 16 షాపులు రైతులు ఉచితంగా ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన 13 షాపుల్లో 9 డ్వాక్రా గ్రూపులకు, మిగిలినవి కమర్షియల్‌కు అద్దెకు ఇచ్చారు. ఒక్కో షాపునకు గతంలో రూ.1700 అద్దె చొప్పున మొత్తం నెలకు 22,100 వసూలు చేశారు. కరోనాలో కూడా షాపుల అద్దే విలువ పెంచుకుంటూ ప్రభుత్వం వచ్చింది. ప్రస్తుతం ఈ షాపులకు అద్దె రూ.2600 పెంచారు. పెరిగిన అద్దె 13 షాపులకు రూ.33,800 వసూలు చేస్తున్నారు. మిగిలిన మూడు షాపుల్లో ఒక షాపులో కిరాణా షాపు నడుస్తుంది. ఈ షాపును ప్రస్తుతం నాలుగు షాపులుగా విభజించారు. వీటిలో ఒక్కొక్కొదానికి రూ.4వేలు చొప్పున అద్దె పెంచారు. మరొకటి ఆయిల్ షాపుగా ఏర్పాటు చేసి నిర్మాణంలో ఉంది. దీనిని త్వరలో ప్రారంభిస్తారు. ఈ షాపు విలువ కూడా అద్దె రూ.4వేలుగా నిర్ణయించారు. గతంలో రూ.1700 ఉండేదని పెరిగిన అద్దె భరించలేకున్నామని అద్దెదారులు వాపోతున్నారు.


మంగళగిరిలో రైతు బజార్

మండుతున్న కూరగాయల రేట్లు

మంగళగిరిలో రైతు బజార్లో కూరగాయల రేట్లు ఎక్కువగా ఉంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. 2014 సంవత్సరం ముందు మంగళగిరి మండలం, తాడేపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూముల్లో కూరగాయల పంటలు ఎక్కువగా పండేవి. ఆ పంటలను రైతులు నేరుగా తీసుకువచ్చి రైతు బజార్లో విక్రయించేవారు. అందువలన అప్పటి రోజుల్లో కూరగాయలు రేట్లు కొంతవరకు తగ్గి ఉండేవి. అమరావతి రాజధాని ఏర్పడిన తర్వాత రైతులు తమ భూములను రాజధానికి ఇచ్చేయడం జరిగింది. దీంతో మంగళగిరి పడమర వైపు అన్ని గ్రామాలు, తాడేపల్లి మండలం లోని కొన్ని గ్రామాలు, తుళ్లూరు మండలం గ్రామాల నుండి వ్యవసాయం లేకపోవడం వలన కూరగాయలు పండించలేదు. ప్రస్తుతం మంగళగిరి రైతు బజార్‌కి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కూరగాయలు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకురావడం వలన రేట్లు అధికంగా ఉంటున్నాయని తెలుస్తుంది. అయితే గుంటూరు, విజయవాడ రైతు బజార్ కన్నా ఎక్కువగా రేట్లు ఎందుకు ఉంటున్నాయో ఈ ప్రాంత ప్రజలకు అర్థం కావడం లేదు. ఒకపక్క ప్రభుత్వం షాపుల అద్దెలు పెంచడం వలన ఆ షాపుల్లో కూడా నిత్యవసర వస్తువులు ధరలు అధికంగానే ఉంటున్నాయి. రైతు బజార్లో కూరగాయల ధరలను తగ్గించే విధంగా ఎస్టేట్ అధికారి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే అద్దెలు పెంచాం

ఎస్టేట్ అధికారి రమేష్



ప్రభుత్వ ఆదేశాల మేరకే డ్వాక్రా షాపులు, వాణిజ్య షాపుల హద్దులు పెంచడం జరిగిందని రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి రమేష్ తెలిపారు. కిరాణా కొట్టును నాలుగు భాగాలుగా విభజించడం ప్రభుత్వ ఆదేశాల మేరకేనని తెలిపారు. రైతు బజార్ల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తమకు ఎవరి మీద కక్షలు లేవని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే అలా చేసేమని తెలిపారు.

కావాలనే కిరాణా కొట్టును విడదీశారు

కే మాధవ సోమేశ్వరరావు



రైతు బజార్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న కిరాణా కొట్టును కక్ష సాధింపులు చర్యల్లో భాగంగా నాలుగు షాపులుగా విడదీశారని కిరాణా కొట్టు యజమాని కే మాధవ సోమేశ్వరరావు తెలిపారు. తనకు లైసెన్స్ ఉన్నాగాని బలవంతంగా విడదీశారని తెలిపారు. చిన్న షాపింగ్ చేసి మరలా 4000 రూపాయలు అద్దె చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇలా చేయడం వలన నష్టం వాటిల్లుతుందని వాపోయారు.

షాపు అద్దెలు పెంచినా చేసేదేమీ లేదు



టమాటాలు అమ్మే షాప్ యజమాని ఎం వెంకటేశ్వరావు మాట్లాడుతూ షాపు అద్దెల పెంచిన భారమైన చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే పెంచడం జరిగిందని అన్నారు.

జీవో 45 పై రాజధాని రైతు జెఎసి ఆగ్రహం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వకుండా రైతులు అడ్డుకుంటున్నారంటూ విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని రైతు జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజధాని ప్రాంతం వెలగపూడి లోని రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి దళిత జెఎసి కన్వీనర్ గడ్డం మార్టిన్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో సొంత ఇల్లు, స్థలం లేని పేదలకు గత ప్రభుత్వం ఫేజ్ 1 కింద 5,024 టిడ్కో గృహాలను నిర్మించడం జరిగిందని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా వాటిని పేదలకు అప్పగించ లేదన్నారు. దళితులు, పేదలైన అసైన్డ్ రైతులకు రెండేళ్ల కౌలు నేటి వరకూ చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు సమాన ప్యాకేజీ, అమరావతి ఫించన్ రూ.2,500లను రూ .5వేలకు పెంపు అతీగతీ లేదన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్ ను విచ్ఛిన్నం చేయడం మినహా పేదలపై వైసిపి ప్రభుత్వానికి ఎలాంటి ప్రేమా లేదన్నారు. ఇళ్ళ స్థలాల పేరుతో వైసిపి కార్యకర్తలు, గూండాలను అమరావతిలో ఇళ్ళ స్థలాలు ఇవ్వాలనే ప్రభుత్వ కుట్రలను సాగనీయబోమని పులి చిన్నా అన్నారు. ధనేకుల రామారావు మాట్లాడుతూ అమరావతి కోసం సమీకరించిన భూముల్లో రాజధానేతర ప్రాంత వాసులకు ఇళ్ళ స్థలాలుగా ఇచ్చేందుకు 1,134 ఎకరాలను గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు బదలాయిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 45 పై న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో అమరావతి ముస్లిం మైనారిటీ జెఎసి నాయకులు సాహెబ్ జాన్, దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య,చేకుర్తి రవి, కంచర్ల గాంధీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అమరావతి దళిత జెఎసి కన్వీనర్ గడ్డం మార్టిన్

1205 వ రోజుకు అమరావతి ఆందోళనలు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు చేస్తున్న ఆందోళనలు బుధవారంతో 1205 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, అనంతవరం, ఉద్దండరాయునిపాలెం వెలగపూడి,నెక్కల్లు,వెంకటపాలెం తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు సాగాయి. కోర్టుల్లో కేసులు ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా చీకటి జీవోలు తెస్తోందని రైతులు మండిపడ్డారు.రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలంటూ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని అన్నారు. ఉద్దండరాయునిపాలెం రైతు దీక్షా శిబిరంలో అసైన్డ్ రైతు పులి చిన్నా, మరికొంత మంది రైతులు బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు.



కార్యకర్తలు, కన్వీనర్ల పాత్ర కీలకం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

'7 నుండి 20 వరకు జగనన్నే మా భవిష్యత్తు' ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతిపక్షాలన్నీ ఏకమైనా వైసిపికి నష్టం లేదని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలుస్తామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరి అధ్యక్షతన జరిగిన సచివాలాయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అన్ని వర్గాల ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ... ఈ ప్రయోజనాల పరంపర కొనసాగాలంటే మళ్ళీ వైయస్ జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను గుర్తు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు సచివాలయ కన్వినర్లని ప్రకటించారు. వారికి పార్టీలో ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని గృహ సారథులను కలుపుకుని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని దాదాపు ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో లబ్ది చేకూరినట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), మిర్చియార్డు ఛైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు బందా రవీంద్రనాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ ప్రాంతంలో కొత్త ట్రాన్సఫార్మర్ నిమిత్తం గురువారం విద్యుత్‌నకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఆక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి మండలంలో ముగ్గురోడ్డు ఏరియాలో ఉదయం 10గంటల నుండి 11వరకు, సిఎస్ఆర్ ఫంక్షన్ హాలు ఏరియాలో ఉదయం 11 నుండి 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.



ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలతో లబ్ధి

మాజీ మంత్రి మేకతోటి సుచరిత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాష్ట్రంలో ప్రతి మహిళకు నెలలో ఎదో ఒక పథకం ద్వార లబ్ధి చేకూరుతుందని మాజీ మంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ ఆసరా కార్యక్రంమం ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి దాసరి అన్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్‌చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సుచరిత మాట్లాడారు.ప్రత్తిపాడు మండలంలో 1003 మహిళా స్వయం సహాయక సంఘాలలోని 10,030 మంది అక్క చెల్లెమ్మలకు రూ. .8.98 కోట్లు లబ్ధి చేకూరుతుంది అని తెలిపారు. అక్క చెల్లెమ్మలకు అందే ఈ మొత్తంను, వారు ఎలా ఉపయోగించుకుంటారన్న అంశం మీద ఎలాంటి షరతులు లేవు వారి జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకురావాలనే ఆలోచనతో మన ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీ రమ్యజ్యోతి, పంచాయతీ వైస్ ప్రసిడెండ్ వెంకటేశ్వరరెడ్డి, జడ్‌పిటిసి విప్పాల కృష్ణారెడ్డి, తహశీల్దార్ ఎం లీల సంజీవ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో పొన్నూరు మున్సిపాలిటి : ధూళిపాళ్ల

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు మున్సిపాలిటీ అవినీతి కంపులో కురుకుపోయిందని గ్రామ సచివాలయం నుంచి మున్సిపాలిటీ వరకు ఒక నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పెద్ద ఎత్తున దండుకుంటున్నారని వీరికి స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అండదండలు ఉన్నాయని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం సీనియర్ నేత, పొన్నూరు మాజీ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. పొన్నూరు నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ పనుల్లో జరుగుతున్న అవినీతిపై స్థానిక టిడిపి కార్యాలయంలో నరేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న వారి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరించకపోగా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పొన్నూరు మున్సిపాల్టీలో జరుగుతున్న పనులకు ఉన్నతాధికారుల నుంచి పరిపాలన అనుమతులు ఉండటం లేదని, దానిపై ఎవరు సంతకాలు లేకుండా వారికి నచ్చినట్లే అంచనాలు రూపొందించుకుంటూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. 2019-20 సంవత్సరాలలో శాంక్షన్ అయిన పనులను మూడున్నర సంవత్సరాల తర్వాత ఇప్పుడు చేసి పెద్ద ఎత్తున అంచనాలు పెంచుతున్నారని, ఫలితంగా పొన్నూరు పురపాలక సంఘానికి పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందన్నారు. ఇటికంపాడు రోడ్డు నుంచి చిన రామ మందిరం వరకు సిసి రోడ్డు శాంక్షన్ కాగా, ఇటికంపాడు నుంచి కాకుండా మధ్య నుంచి మొదలుపెట్టి చినరామ మందిరం వరకు నిర్మాణం చేశారని తెలిపారు. చిన్న షాపు పెట్టుకుంటే గద్దల్లా వాలిపోయి టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా బెదిరించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. దోపిడీ చేస్తే కాల్ చేయాలని చెబుతున్న ప్రభుత్వం పొన్నూరులో జరిగే దోపిడి పై ఎందుకు చర్యలు తీసుకోరన్నారు. కార్యక్రమములో పొన్నూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ ఆకుల సాంబశివరావు, ఎద్దు సోంబాబు, తానికొండ లక్ష్మి నారాయణ చౌదరి, అనిశెట్టి వీరబాబు, పిన్నమనేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట'

ప్రజాశక్తి-మాచర్ల

బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు ఆర్థిక చేయూతను అందించి, వారిని సాధికారత వైపు నడిపించటానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. వైఎస్ఆర్ అసరా చెక్కుల పంపిణి సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, మానుకొండ కళ్యాణ మంటపాలలో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల పరిధిలోని 945 స్వయం సహాయక సంఘాల సభ్యులు 9,462 మంది లబ్ధిదారులకు రూ7.99 కోట్ల చెక్కును, మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 677 సంఘాలకు చెందిన 6,520 మంది రూ 7.80 కోట్లు లబ్ధిదారుల ఖాతాలలో రామక్రిష్ణారెడ్డి ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో పొదుపు సంఘాల సభ్యులు హాజరయ్యారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా నేరుగా నిరుపేదలకు లబ్ది చేకూర్చుతోందని అన్నారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమీషనర్ ఇవి రమణ బాబు, ఎం.పి.పి బూడిద మం గమ్మ, ఎంఎడిఓ కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, బూడిద శ్రీనివాస రావు పాల్గొన్నారు.

669 గ్రూపులకు ఆసరా

ప్రజాశక్తి- వినుకొండ

పట్టణంలోని కారంపూడి రోడ్‌లోని బ్రహ్మనాయుడు కళ్యాణ మండపంలో వినుకొండ మండలం 3వ విడత ఆసరా



సంబరాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. వినుకొండ మండల పరిధిలోని 669 గ్రూపులకు రూ.3 కోట్ల 89 లక్షల 46 వేల 983 రూపాయల చెక్కును అర్హులైన మహిళలకు అందజేశామన్నారు. తమ ప్రాంత మహిళల తరపున ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మెగా మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక ఇమ్మానియేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో న్యూ పల్నాడు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి అధ్యక్షులు పి. సాల్మన్ రాజు తెలిపారు.అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని, ఈ అవకాశాన్ని చర్చి సంఘీయులు, పట్టణ ప్రజలు విని యోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే షాదీఖానా పాడుబడింది: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

పట్టణంలోని షాదీఖానాను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ముస్లింలకు వైసిపి తీరని అన్యాయం చేస్తోందని నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ధ్వజమెత్తారు. పట్టణంలోని షాదీఖానాను ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం అరవిందబాబు మాట్లాడుతూ టిడిపి హయాంలో షాదీఖానాను అద్బుతంగా నిర్మించి పేద ముస్లింలు పెళ్లిళ్లు,ఫంక్షన్లు చేసుకోవడానికి అందుబాటులోకి తెచ్చామన్నారు. నేడు ప్రభుత్వం ఆ షాదీఖానా పర్యవేక్షణను గాలి కొదిలేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే షాదీఖానా పాడుబడిందని, తలుపులు,కిటికీలు పగిలిపోయాయని అన్నారు. షాదీఖానా కరెంట్ బిల్లు,నీటి పన్ను,ఆస్తి పన్ను కట్టలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. .ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధికారులు దీనిపై దృష్టి సారించి షాదీఖానాను పునర్నిర్మించి, వెంటనే వినియోగంలోకి తేవాలని కోరారు.

'యువతను మోసం చేసిన పభుత్వం'

ప్రజాశక్తి-వినుకొండ



సీఎం జగన్మోహన్ రెడ్డి నాడు ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్, నిరుద్యోగ యువతను మోసం చేశారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో రోజురోజుకి నిరుద్యోగం పెరిగిపోతోందని, నాలుగేళ్లుగా నిరుద్యోగులంతా అల్లాడుతున్నారు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని చెప్పి జగన్ మోసం చేశాడని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు ఎటువంటి ఉపాధి కల్పన లేకుండా పోయిందని, చిన్న చిన్న పరిశ్రమలు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఇక ఇటీవల పల్నాడు జిల్లాలో అకాల వర్షాలకు వివిధ రకాల పంటలు తీవ్రంగా నష్టం జరిగిందని నష్టపరిహారం రైతులకు ఇవ్వలేదని జీవి అన్నారు. ఒక్కొక్క రైతుకు 50 వేల నుండి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంవగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుపై విమర్శలు, ఆరోపణలు చేశారు.ఎస్టి హాస్టల్‌ను పట్టణంలో ఎన్ఎస్పి లో నిర్మించాలని డిమాండ్ చేశారు. వినుకొండలో భారీ ఎత్తున ఇసుక మట్టి వ్యాపారం జరుగుతోందని ట్రాక్టర్ ఇసుకకు రూ.7000 వసూలు చేస్తున్నారని అన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా విలేకరులు

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్, స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో డాక్టర్ చదలవాడ అర విందబాబు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీ వన్ రామ్ 116 వ జయంతి వేడుకలు నిర్వహించారు. పల్నాడు రోడ్డు లోని ఏరియా ఆస్పత్రి ఎదురుగా గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మె ల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దళిత వర్గాల అభ్యున్నతికి పాటు పడ్డారని, బావి తరాలకు స్వాతంత్ర్య ఫలాలు అందించారని అన్నారు. వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూలమాలలు వేసి



నివాళులర్పించారు. అనంతరం జాషువా కళాప్రాంగణంలో నిర్వ హించిన జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. వినుకొండ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వర రావు ఆధ్వ ర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వ ర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పట్టణ అధ్యక్షులు వాంకు డావత్ బాబు నాయక్ తో పాటుగా బం జారా సేవా సంఘం పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసరావుపేట రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహనికి పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు జి.వి. ఆంజ నేయులు పూలమాలవేసి నివాళులర్పించారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగ్జీవన్ రామ్ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వినుకొండ మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రూల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రముఖ రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణ రాజు రచించిన 'ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సత్తెనపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు చౌట శ్రీనివాసరావు మాట్లాడారు.

పిడుగురాళ్లపట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద చైర్మన్ బాబు జగజ్జీవన్ రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి కార్యాలయంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము ముక్కంటి, జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యా లయంలో తెలుగు దేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో జగ్జీ వన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేసన్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండల కేంద్రం కారెంపూడిలోని పాత బ్యాంకు సెంటర్‌లో దళిత సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కారెంపూడి సిఐ డి.జయకుమార్, ఎంపిపి మేకల శారద శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి షేక్ షఫీ పాల్గొన్నారు. దళిత సంఘం నాయకులు ఎ.ఏసోబు, ఎం.ప్రవీణ్, సర్పంచ్ రామావత్ ప్రమీలాబాయి తేజా నాయక్, పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, మండల వైసిపి అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.





మాచర్లలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి,యువజన సంఘ ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి, జివి సత్యనారాయణ తదితరులు ప్రధాన రహదారిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో,దళిత బహుజన, సంక్షేమ సం ఘం, భీమ్ సేన ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అమరావతిలో కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎస్.రాజు ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భారతదేశానికి జగజ్జీవన్ రామ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు మితాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బి.సూరిబాబు, ప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు. మహనీయుడు జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించాలని బెల్లంకొండ సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం విజ్ఞప్తి చేశారు. బెల్లంకొండ కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముప్పాళ్ల మండలంలోని గోళ్ళపాడులో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్‌పి ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈపూరు సెంటర్ లోని ఎమ్మార్పీఎస్ జండా వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దేటి పౌలేష్, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు రెడ్డి బోయిన ప్రసన్నకుమార్ మాట్లాడారు. గ్రామ కూడలిలో జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్

ఘనంగా జయంతి వేడుకలు


గుంటూరు


ఆత్మకూరు


వడ్డేశ్వరం



ప్రజాశక్తి-గుంటూరు:అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ నిర్మాణం కోసం జీవితాంతం పోరాడిన చైతన్య మూర్తి, భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు.బుధవారం జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ యం.పురుషోత్తం, యం.ఆర్.ఇ.డి.సి.ఏ.పి డైరెక్టర్ కొత్త చిన్నపరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జిఎంసి డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన సభలో వారు ప్రసంగించారు. **కావటి మనోహర్‌నాయుడు, మద్దాళి గిరిధర్ నివాళి..**నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ బుధవారం మార్కెట్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ వనమా బాల వజ్ర బాబు, కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.**మేడ్ ఆధ్వర్యంలో..**ఏపీ మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్(మేడ్) ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక హిందు కాలేజి కూడలి వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడారు. **అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..** స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ అధికారి సిహెచ్.ప్రసాద్, అవగాహన సభ్యులు ఆర్.వెంకటరత్నం, ఎల్. మురళీకృష్ణ, దేవదాసు పాల్గొన్నారు. **భీమ్ భారత్ కార్యాలయంలో..** స్థానిక అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం నాయకులు దొడ్డ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భీమ్ భారత్ అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అంకం శ్యామ్, న్యాయవాది సుబ్బారావు, మహిళా నాయకులు ఎస్‌కె.బాజీ, చేవూరి కోటేశ్వరమ్మ, కోడెల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. **మంగళగిరి:**మాజీ ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సెంటర్లో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.టిడిపి నాయకులు వి మైనర్ బాబులు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎం. వెంకట మారుతిరావు,వి. శ్రీనివాసరావులు పాల్గొన్నారు. బిజెపి ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, ఏ.నాగేంద్రలు పాల్గొన్నారు. ఏపీఎస్పీ కమాండెంట్ కార్యాలయంలో కమాండెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.**పొన్నూరు రూరల్:** తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాద్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలాలు వేసి నివాళులు అర్పించారు. **ఎఎన్‌యు:.** బాబు జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం వారి ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయ సీడీసీ డీన్ ఆచార్య కమిడి మధుబాబు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. మొదటిగా బాబు జగజ్జీవన్ రామ్ విద్య అధ్యయన కేంద్రం వద్ద నివాళులు అర్పించారు. తదుపరి అధ్యయన కేంద్రం నుండి విశ్వ విద్యాలయం వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం వద్దకు వందలాది మంది అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ర్యాలీ నిర్వహించి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **తాడేపల్లి రూరల్:** భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి.జగ్జీవన్ రామ్ విగ్రహానికి సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య , ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు అద్దేపల్లి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గ్రామ సీనియర్ నాయకులు వడ్డేశ్వరం కోటేశ్వరరావు, ఈ. చిన్న సోమయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.**వడ్డేశ్వరం టిడిపి ఆధ్వర్యంలో ..** జగ్జీవన్‌న్ రామ్ జయంతి వేడుకలు వడ్డేశ్వరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టిడిపి మండల కో- ఆర్డినేటర్ కాట్రగడ్డ మధుసూదన్ రావు, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి పి సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు. **మండల పరిషత్ కార్యాలయంలో..** ఎంటిఎంసీ పరిధిలోని తాడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎస్‌టి యు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప, రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప , మండల అధ్యక్షులు బి సురేష్ బాబు,కార్యదర్శి రవీంద్ర బాబు, ముస్తఫా, సాయి కుమార్‌లు పాల్గొన్నారు. **తాడేపల్లి:** పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తాడేపల్లి సాయిబాబాగుడి వద్ద, తహశీల్దార్ కార్యాలయం వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు అన్ని పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో డి.సుందరరావుయాదవ్, ఎ.మురళీ, ఎం.గోపాలరావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి వేమారెడ్డి ఆదేశాలతో మున్సిపల్ కార్యాలయం సమీపంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉండవల్లిలో టిడిపి గ్రామ అధ్యక్షులు గాదె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణు గోపాలసోమిరెడ్డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. రార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొన్నారు. **మంగళగిరి రూరల్:** మండల పరిధిలోని ఆత్మకూరులో సిపిఎం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సిపిఎం మండల నాయకులు మొసలి పకీరయ్య, సీనియర్ నాయకులు పులివర్తి ప్రసాదు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఫకీరయ్య మాట్లాడుతూ నేడు ఎంతోమంది జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలు నడపాలని అన్నారు. సిపిఎం గ్రామ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం అజయ్ కుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు బిట్ర రాంబాబు, వి.రామారావు, డి.పద్మనాభశర్మ, వి.సాంబశివరావు, పి.వెంకటేశ్వరరావు, జాను, ఆంజ నేయులు, శేషయ్య,మరియ దాసు, సురేష్‌పాల్గొన్నారు. **తెనాలి:** భారత మాజీ ఉప ప్రధాని, దళిత మేధావి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు, అయితానగర్ కూడలి, రూరల్ గ్రామం కొలకలూరు సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నివాళులర్పించి మాట్లాడారు. మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్ధపల్లి నాగరాజు సారధ్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళు లర్పించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు సారద్యంలో ఐతానగర్ కూడలిలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ జయంతికి నాయకులు టి. హరిప్రసాద్, కే. ఏడుకొండలు, జే.మహేష్‌లు నివాళులర్పించారు. **మంగళగిరి రూరల్:** భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన రామ్ 116వ జయంతి సందర్భంగా మంగళగిరి తాడేపల్లి - నగరపాలక సంస్థ పరిధి నవులూరు గోలివారితోట మహాత్మా గాంధీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ, మదర్ థెరిస్సా విగ్రహాలను బుధవారం వారు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావులు ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. **పొన్నూరు రూరల్** : టిడిపి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. **మేడికొండూరు:** మండలంలోని పేరేచర్ల సత్తెనపల్లి రోడ్డులోని పాములపాటి చంద్రయ్య మైదానంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూర్ సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ, జవహర్,జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, చలపతి విద్యాసంస్థల అధినేత వైవి ఆంజనేయులు, జీవి ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, పేరేచర్ల సర్పంచి దేవరకొండ రాజ్ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి నేడు శంకుస్థాపన

నెరవేరనున్న 150 ఏళ్ల కల



ప్రజాశక్తి- దుగ్గిరాల : దాదాపు 150 ఏళ్ల నిరీక్షణ అనంతరం స్థానిక సుగాలి కాలనీ నాగేంద్ర నగర్‌లో నివసించే వారి కల నెరవేరనున్నది. వీరు బస్సు కోసం రావాలన్నా విద్యార్థులు పాఠశాలలకు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రావాలన్నా ప్రస్తుతం ఉన్న రైలు పేట వంతెన మీదుగా దాదాపు అర కిలో మీటర్ దూరం నుండి రావాల్సి ఉంటుంది. అనాది నుండి విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు.ఎట్టకేలకు స్థానిక సీసీఎల్ కాఫీ ఫ్యాక్టరీ వారి ఆర్థిక సహాయంతో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో గురువారం ఫుడ్ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నారని వైసిపి నాయకులు తెలిపారు. బుధవారం ఆ పార్టీ నాయకులు బాణావత్ వెంకటేశ్వర నాయక్ శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.దాదాపు రూ.25 లక్షలతో ఏడు అడుగుల వెడల్పు బ్రిడ్జిని నిర్మించనున్నారు. సుగాలి కాలనీ నాగేంద్ర నగర్,గాంధీనగర్ పెనుమూలి గ్రామ వాసులే గాక చెన్నకేశవ నగర్ ఏర్పడిన తర్వాత వారు కూడా రైలుపేట వంతెన మీదుగానే వస్తున్నారు. అలాగే మంచికలపూడి వద్ద బకింగ్‌హామ్ కాలవపై రూ.30లక్షలతో మరో ఫుట్ బ్రిడ్జికి కూడా శంకుస్థాపన చేయనున్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-తాడికొండ :మాజీ ఉప ప్రధాని బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా తాడికొండ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ జ్యోతుల మురళి కృష్ణ ఆధ్వర్యంలో 150 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బీవీ, షుగర్ చర్మ వ్యాధులు, గుండె, నరాలు, బ్రెయిన్, కీళ్ల నొప్పులు, మొదలైన వ్యాధులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ, ఎస్. సునీల్ ,బి. వంశీ, బీ. హర్ష , వైద్య సిబ్బంది, చర్చి పెద్దలు, ఉండవల్లి సుధాకర్ నూతక్కి యశోద రావు, ఎన్. సాంబయ్యలు పాల్గొన్నారు.

సునీత్ చోప్రా మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -మంగళగిరి:అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు కామ్రేడ్ సునీత్ చోప్రా ఢిల్లీ ర్యాలీకి వెళుతూ మంగళవారం నాడు హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. సునీత్ చోప్రాకు సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి జోహార్లు అర్పించారు.కామ్రేడ్ సునీత్ చోప్రా 2009 సెప్టెంబర్ 10,11 తేదీలలో మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా 25వ మహాసభలను ప్రారంభించి మాట్లాడారని రవి పేర్కొన్నారు.


వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

దర్శకుడు వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్:మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో బుధవారం ఎన్టీఆర్ నటించిన రక్తసంబంధం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుణ్ణి సన్మానించే కార్యక్రమంలో పట్టణ పౌరాణిక నాటక కళాకారుడు, దర్శకుడు వెంకటేశ్వరరావును టిడిపి నాయకులు పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, పెద్దిటి యోహాను, వరికూటి సోమయ్య తదితరులు సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపిక అందించారు. థియేటర్ కమిటీ సభ్యులు, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, డి భాస్కర్, ఎం వెంకట్, డి నరసయ్య, అల్లాభక్షు, హేమంత్ పాల్గున్నారు.

రత్న కిషోర్ మృతికి సిపిఎం నివాళి


ఎం. రత్న కిషోర్

ప్రజాశక్తి- తెనాలి

విశ్రాంత ఉద్యోగి, సిపిఎం సీనియర్ నాయకులు మాతంగి రత్న కిషోర్ (73) మృతికి సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్న ఆయన స్వగ్రామం గుడివాడకు చేరుకుని, మంగళవారం తుది శ్వాస విడిచారు. సిపిఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రూరల్ గ్రామం గుడివాడకు చెందిన రత్న కిషోర్ సుదీర్ఘకాలం సిపిఎం తెనాలి తాలూకా కమిటీ సభ్యులుగా పనిచేశారన్నారు. ఉద్యోగిగా ఏలూరులో పనిచేసిన కాలంలో మధ్య తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులుగా కూడా పనిచేశారని, గతంలో గ్రామ సర్పంచిగా పోటీ చేసి కేవలం 30 ఓట్ల తేడాతో ఓటమి చెందారన్నారు. సిపిఎం ఉద్యమ కార్యాచరణలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారని సాంబిరెడ్డి తెలిపారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, తెనాలి పట్టణ కార్యదర్శి కె.బాబు ప్రసాద్, వల్లభనేని సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, తుమ్మపూడి మాజీ సర్పంచ్ వివన్ ప్రసాద్, కంచర్లపాలెం మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకర్ రావులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్‌టిఆర్ స్విమ్మింగ్‌పూల్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక శ్యామలా నగర్ రోడ్డులోని గుంటూరు నగర పాలక సంస్థ యన్.టి.ఆర్ స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతుల అనంతరం బుధవారం నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ ప్రారంభించారు. ముందుగా ప్రకటించిన విధంగా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి, వేసవి నాటికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ వేసవిలో ప్రజలకు స్విమ్మింగ్ పూల్ ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుందన్నారు. ప్రజలు స్విమ్మింగ్ చేయటం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఫిల్టర్ ప్లాంట్లకు కూడా మరమ్మతులు చేపట్టటం జరిగిందని, పరిసర ప్రాంతాలు కూడా ఆహ్లాదంగా ఉండేలా గ్రీనరి అభివద్ధి చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్‌రావు, నిమ్మల వెంకట రమణ, తేలుకుట్ల హనుమాయమ్మ యోగేశ్వర రావు, అందుగుల సంతోష్, ఈఈ సుందర రామిరెడ్డి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎంసెంట్ కోచింగ్ సెంటర్

మాచర్లలో ప్రారంభించిన న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న ఎంసెట్ కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మాచర్ల పట్టణంలో యాపిల్ ఐఐటి స్కూల్లో పల్నాడు జిల్లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. టెక్నికల్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజులలో టెక్నికల్ ఎడ్యూకేషన్‌కు మరింత ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ అందిస్తున్న కోచింగ్ సద్వినియోగం చేసుకుని ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఎస్.ఎఫ్.ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్ రాజు మాట్లాడుతూ గత సంవత్సరం సీనియర్ ఫ్యాకల్టీలతో అందించిన కోచింగ్‌లో రాణించిన విద్యార్థులు 10వేలు లోపు ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఈ సంవత్సరం కూడ 150 మంది విద్యార్థులతో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు కూడ ఉచితంగా అందజేస్తామని, ప్రతి సబ్జెక్ట్‌కు ఇద్దరు ఫ్యాకల్టీలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు కే జ్యోతిష్ కుమార్, భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలికి వల్లూరు శివప్రసాద్ నియామకం



ప్రజాశక్తి-గుంటూరు : కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ నుండి అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కథా, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ నియమితులయ్యారు.అలాగే వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు, ప్రముఖ కథా రచయిత్రి వినోదిని, సీనియర్ జర్నలిస్టు నవాల రచయిత చింతకింది శ్రీనివాసరావు, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావులను నియమించారు. అయిదు సంవత్సరాల పాటు వీరు ఈబాధ్యతల్లో ఉంటారు. ఈ సందర్భంగా అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కె.శరశ్చంద్రజ్యోశ్రీ, రాష్ట్రం నలుమూలల నుండి నాటక రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ, శివప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

మోడీ, అదానీకి ఉన్న సంబంధం బయట పెట్టాలి

డిసిసి పల్నాడు జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

రాహుల్ గాంధీని పార్లమెంటు సభ్యునిగా అనర్హత వేటు వేయడం వెనుక మోడీ హస్తం వుందని డిసిసి పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐసిసి, పిసిసి, మరియు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు ఇచ్చిన పిలుపు మేరకు రాహుల్ గాంధీ పై అనర్హత వేటును నిరసిస్తూ నరసరావుపేట పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ విషయంలో జరిగిన అన్యాయం గురించి రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. పల్నాడు జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో వేల పోస్టు కార్డుల ద్వారా మోడీకి నిరసన తెలిపారుమన్నారు. ప్రధానమంత్రి అదానీ కి సమ కూర్చిన నిధులు గురించి, వారి బంధం గురించి పార్లమెంట్లో ప్రశ్నించి సమాధానం చెప్పమని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పథకం ప్రకారం జైలు శిక్ష, పార్లమెంట్‌లో అనర్హత వేటు వేసి అదానితో ఉన్న బంధాన్ని, వారికి నిధులు సమకూర్చిన వైనాన్ని దేశ ప్రజలకు చెప్పకుండా తప్పించుకున్న మోడీని దేశ ప్రజలందరూ మరియు ప్రపంచ దేశాల నాయకులు తప్పుపడుతున్నారన్నారు. నీతి నిజాయితీ కలిగిన రాహుల్ గాంధీని అనర్హత వేటితో పార్లమెంటుకు దూరం చేశారన్నారు. రాహుల్ గాంధీ నిత్యం పేదల కోసం దేశ ప్రజల కోసం మోడీ అండ్ టీం చేసే అన్యాయాలను ధన దోపిడిని అక్రమాలను మత తత్వ వాదాన్ని ప్రశ్నించడాన్ని మోడీ ఓర్చుకోలేక పోతున్నారన్నారు. జిల్లా యూత్ అధ్యక్షులు గంటా గోపి మాట్లాడుతూ పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా మోడీకి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పై చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రాహుల్ గాంధీ పై వేసిన అనర్హతవేటు తొలగించే వరకు యూత్ కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమములో జిల్లా వైస్ ప్రెసిడెంట్ శివా అర్జున్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, వజ్ర గిరి రవి, భరత్, శ్రీధర్ కష్టారావు ఎస్ఎం భాష స్వర్ణ శ్రీను ఇమ్మానుయేల్ జాన్ కాల్విన్ , రమేష్ రవికిషోర్, పి రమేష్, పులి రాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా

14 నుండి సిపిఎం ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14 న అంబేద్కర్ జయంతి నుండి 30 వ తారీకు వరకు పెద్ద ఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. బుధవారం పెదనందిపాడు విశ్రాంత ఉపాధ్యాయుల భవనంలో సిపిఎం నాయకులు కొత్త వెంకట శివరావు అధ్యక్షతన సమావేశంల నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు, డీజలు, వంట గ్యాస్ మరియు నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రజల ఆదాయాలు మాత్రం అంతకంతకు తగ్గిపోతున్నాయన్నారు. అంతేకాకుండా బిజెపి కుల, మత ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతున్నదని, ముస్లింలు, క్రైస్తవుల పై దాడులు పెరిగాయని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతున్నారని చెప్పారు. కార్మిక చట్టాలను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాస్తున్నారని, భారత రాజ్యాంగంలో ఉన్న మౌలిక సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను అణిచివేయాలని చూస్తున్నారని చెప్పారు. గవర్నర్ల వ్యవస్థ ద్వారా ప్రతిపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో మితిమీరి జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఎం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయన్నారు రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తే వారిపై నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, గుంటూరు ఛానల్ పొడిగింపునకు, భూసేకరణకు వెంటనే నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, చుక్కా యానాదులు, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి, పటాన్ సలీం పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బుచ్చయ్యతోట 1వ లైనులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నాసా కాంటెస్ట్‌లో తమ సత్తా చాటారు. స్పేస్ ఫ్యూచర్ అనే పేరుతో పరిశోధనా పత్రాన్ని సమర్పించి, ప్రపంచలోనే మూడవ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. నాసా కాంటెస్ట్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టులలో 89 ప్రాజెక్టులు భారత దేశం నుండి కాగా వాటిలో 54ప్రాజెక్టులు శ్రీచైతన్య పాఠశాలకు సంబంధించినవే ఉన్నాయని శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ అజయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అంజయ్య, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కోఆర్డినేటర్ గోవర్ధన్, డీన్ శంకర్, నాసా ఇన్‌ఛార్జి మనీషా, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అంజయ్య తదితరులు

బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ పలాయనం ..

రూ.3 కోట్ల నగదు స్వాహా

ప్రజాశక్తి -అచ్చంపేట

అచ్చంపేట మండలం చింతలపల్లికి చెందిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ తోట ఆదిలక్ష్మి గత కొద్ది రోజులుగా కన్పించడం లేదు. బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును తీసుకుని ఆమె పారిపోయినట్లు ఖాతాదారులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రామహిళలు, రైతులు, ఇతర ఖాతాదారుల నుంచి రూ.3 కోట్ల వరకు నగదు తీసుకుని ఆమె పారిపోయినట్టు చింతపల్లి గ్రామస్తులు చెబుతున్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటకు ఈగ్రామం 10 కిలోమీటర్ల దూరం ఉండటంతో గ్రామంలోని ప్రజలు తమ ఖాతాల లావాదేవీలు బిజినెస్ కరస్పాండెంట్ ద్వారా నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో ఆదిలక్ష్మి గుంటూరు వెళ్లడం ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయటంతో గ్రామస్తులు తమ ఖాతాలో నిల్వలు గురించి అచ్చంపేటలోని చైతన్య బ్యాంకు వచ్చి విచారించారు. డ్వాక్రా మహిళలు తమ అప్పులో నగదు జమ కాలేదంటూ తెలియటంతో ఆందోళన చెందారు. దీనికి తోడు గ్రామంలో కొందరు అధిక వడ్డీకి ఆశపడి లక్షల్లో అప్పులు ఇచ్చామని తెలియడంతో ఆదిలక్ష్మి ప్రజలకు మూడు కోట్లకు పైగా అప్పులు చేసి గ్రామం వదిలి వెళ్లి పోయింది చెప్పుకుంటున్నారు. దీనిపై బాధితులు అచ్చంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈబీసీ పాయింట్ పరిధిలో 100 గ్రూపులకు పైగా లావా దేవీలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో నగదు జమ చేస్తానని చెప్పడంతో చేతికిచ్చి రసీదు తీసుకోని గ్రూపులున్నాయి. దీంతో రైతులు, డ్వాక్రా మహిళలు ఆందోళనలో చెందుతున్నారు. దీనిపై బ్యాంకు అధికారులను ప్రశ్నించగా బీసీ పాయింట్ నిర్వహణ సరిగా లేదని రైతులు డ్వాక్రా సంఘాల సభ్యులు ఎవరు ఫిర్యాదు చేయలేదంటూ బ్యాంక్ అధికారులు తెలిపారు.

బార్ అసోసియేషన్‌లో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా బుధవారం గుంటూరు బార్ అసోసియేషన్‌లో వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవికె సురేష్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్ధసారథి మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ పేదల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. భారత వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించడంలో, కార్మిక చట్టాలను రూపొందించడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్ మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలనకు, అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని అన్నారు. కార్యక్రమానికి గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిందెల అబ్రహాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి జి.విజయరాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పారి బాబూరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్ధసారథి